క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లప ల్లిలో వెంకట్రమణ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మృతుడి భార్య శంకరమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా సచివాలయ సిబ్బంది, స్థానిక సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణల ద్వారా రూ.10 వేల నగదును అందజేశారు.

సీపీఐ నేత ఖాసీం మృతికి సంతాపం



మహమ్మద్‌ఖాసీం (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోటకు చెందిన సీపీఐ సీనియర్ నేత, కార్మిక నాయకుడు మహ్మద్‌ఖాసీం (68) మంగళవారం ఇంటిలోనే మృతి చెందాడు. బి.కొత్తకోటలో తొలితరం సీపీఐ నేతల్లో ఒకరైన ఖాసీం పార్టీ మండల కార్యదర్శిగా, ఉమ్మడి చిత్తూరుజిల్లా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా బీడీ వర్కర్స్ యూనియన్ నాయకునిగా దశాబ్దాలుగా పోరాటాలు చేశారు. ఆ పార్టీ రాష్ట్ర, జాతీయస్థాయి నేతలతో ఖాసీంకు మంచి సంబంధాలు ఉండేవి. ఆయన మృతికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

వేర్ హౌస్ గోడౌన్ తనిఖీ



గోడౌన్‌లో కందులను పరిశీలిస్తున్న కడప రీజనల్ మేనేజర్ కె. రామకరుణ

పీలేరు రూరల్ : స్థానిక వేర్‌హౌస్ గోడౌన్‌ను ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ కడప రీజనల్ మేనేజర్ కె. రామకరుణ మంగళవారం తనిఖీ చేశారు. గిడ్డంగిలో నాఫెడ్ సంస్థ వారు నిలువ చేసిన 169 టన్నుల కందులను పరిశీలించారు. స్టాకు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోడౌన్‌లో ధాన్యంను భద్రంగా నిల్వ ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఖాళీగా ఉన్న వేర్‌హౌస్ కాంప్లెక్స్‌లో 20, 34, 35 నెంబరు రూములను ఈ నెల 26న వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేర్‌హౌస్ గోడౌన్ మేనేజర్ వెంకటస్వామి, సీనియర్ అసిస్టెంట్ చాణక్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెబాట



సమస్యలు తెలుసుకుంటున్న పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్

తంబళ్లపల్లె : మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో పల్లెబాట నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం కోసువారిపల్లెలో సర్పంచు విద్యాలక్ష్మి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం జరిగింది. ప్రతి పల్లెలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, సింగిల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు రఘునాథ్, కోటిరెడ్డి, శంకర్‌రెడ్డి, సిద్దేశ్వర్, కిషోర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలోని ఎర్రగుంట్లపల్లె పంచాయతీ నెట్టిబండ సమీపంలోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీన పరచుకున్నారు. తహసీల్దార్ ధనుంజయులు ఆదేశాల మేరకు వీఆర్‌వో యోగ, సర్వేయర్ రెడ్డెప్ప స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి నిర్మాణం కోసం గుణాంతాలు తవ్వడం గుర్తించారు. సర్వే నెంబరు 745లో ఐదెకరాల అనాదీనం భూమి ఉందని, ఈ స్థలంలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విలేజ్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

తంబళ్లపల్లె : మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. కోటి నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. కన్నెమడుగు పంచాయతీలో 3 సీసీరోడ్లు, 3 డ్రైనేజీ కాలువలకు రూ.20 లక్షలు, గుండ్లపల్లెలో ఆరు సీసీరోడ్లకు రూ.20 లక్షలు, కోటకొండలో ఐదు సీసీ రోడ్లును రూ.22 లక్షలు, కుక్కరాజుపల్లెలో ఆరు సీసీ రోడ్లు, పైప్‌లైన్ రూ.20 లక్షలు, రేణుమాకులపల్లె పంచాయతీలో రెండు సీసీ రోడ్లు, రెండు పైప్‌లైన్ పనులు రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

వేడుకగా సీతారాముల శాంతి కల్యాణం

వాల్మీకిపురం : స్థానిక ప్రాచీన శ్రీ పట్టాభిరాముడి ఆలయంలో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలలో రెండవ రోజైన మంగళవారం సీతారాముల వారికి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండలంలో స్వామివార్లకు వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ స్నపన తిరుమంజనం సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన శ్రీ సీతారాముల వారిని ఆలయ ఆవరణంలోని ఆస్థాన మండపంలో విశేషంగా అలంకరించిన మండపానికి తీసుకెళ్లి అధిరోహింపజేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాంతి కల్యాణం నిర్వహించారు. రాత్రి హనుమంతునిపై అధిరోహించి, తిరుమాఢ వీధుల్లో విహరించి, భక్తులను కటాక్షించారు. ఈ వాహన సేవలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.



హనుమంత వాహనంపై విహరిస్తున్న సీతారాములు



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న పండితులు

గ్రూప్–1 ఉద్యోగానికి తప్పుడు ధ్రువపత్రం

విజయవాడ స్పోర్ట్స్: ఏపీపీఎస్సీ–2022 నోటిఫికేషన్‌లోని గ్రూప్–1 ఉద్యోగానికి తప్పుడు ధ్రువపత్రం అందజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సౌత్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ తెలిపారు. ఈ కేసు వివరాలను సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులకు వెల్లడించారు. సౌత్ ఏసీపీ కథనం మేరకు.. గ్రూప్–1 ఉద్యోగాల భర్తీలో భాగంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు 2023 ఆగస్టు రెండు నుంచి 11వ తేదీ వరకు కమిషన్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. అదే నెల పదో తేదీన అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం గుండవనపల్లి గ్రామానికి చెందిన ఎ.లోకేష్ ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. లోకేష్ విజయవాడ జీజీహెచ్ నుంచి తాను 167.7 సెంటీమీటర్లు ఎత్తు ఉన్నట్లు పొందిన సర్టిఫికెట్‌ను కమిషన్‌కు అందజేశారు. అనుమానం వచ్చిన కమిషన్ మరో సారి అతని ఎత్తును నిర్ధారించాలని విజయవాడ జీజీహెచ్‌కు పంపించింది. రెండో దఫా వైద్య పరీక్షల్లో అతని ఎత్తు 167 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉన్నట్లు తేలింది.

ఈ రెండు సర్టిఫికెట్లకు పొంతన లేకపోవడంతో లోకేష్ ఎత్తును నిర్ధారించే బాధ్యతలను పోలీసు, లీగల్ మెట్రాలజీ అధికారులకు అప్పగించారు. ఈ పరీక్షల్లోనూ లోకేష్ ఎత్తు 167 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉన్నట్లు నిర్ధారణైంది. తప్పుడు ధ్రువపత్రం అందజేసి ప్రభుత్వం ఉద్యోగం పొందేందుకు ప్రయత్నించిన నిందితుడు లోకేష్‌పై కమిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీ మాల్‌ప్రాక్టీస్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

మార్కెట్‌యార్డు పనులు ప్రారంభించండి

బి.కొత్తకోట : ఆంగళ్లు–బి.కొత్తకోట వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదేశించారు. హార్సిలీహిల్స్‌పై ఉన్న మంత్రిని మార్కెట్ కమిటి చైర్మన్ డీఆర్.ఉమాపతి కలిశారు. యార్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని, నిధులను విడుదల చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆయిషాను ఆదర్శంగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ : గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన షేక్ ఆయిషాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోలని పోర్డు సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఈశ్వరమ్మకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆయిషాను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికకావడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఆమెను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, సర్పంచు రెడ్డమ్మ, హెచ్‌ఎం చాంద్‌బాషా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పెద్దమండ్యం : ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని బండమీదపల్లె పంచాయతీలో మంగళవారం అధికారులతో కలిసి ఆమె పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని అంగడాలవారిపల్లె, కొట్టేవాండ్లపల్లె, బండమీదపల్లె, మిట్టావాండ్లపల్లె, తుస్సావారిపల్లె, తురకపల్లె గ్రామాలలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లెబాటలో ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జరగబోయే ఎన్నికలలో గెలిపించాలని ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీవో శ్రీధర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, ఎంఈవో 2 రామక్రిష్ణ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, బాషా, విశ్వనాథ, కంటి విశ్వనాథరెడ్డి, మాజీ సర్పంచ్ మొలక సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ చాంద్ బాషా, ఆర్‌బికే చైర్మన్ చాను, జెఎస్‌వి కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండమీదపల్లెలో పల్లెబాట నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈ నెల 25 వేలం పాట

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో వివిధ హక్కులు పొందడానికి ఈ నెల 25న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఏడాది కాలానికి సంబంధించి అమ్మవారి చీరలు, రవికలు సేకరించుకొను హక్కు, కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు పొందడానికి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సాయిబాబా గుడి వీధిలో ఖాళీ స్థలము (4 తాత్కాలిక షెడ్లు)కు సంబంధించి వేలం నిర్వహించనున్నట్ల తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

పీలేరు : ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా రైతు సలహామండలి సభ్యుడు బోదేషావలి అన్నారు. మంగళవారం మండలంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లె గ్రామంలో రైతు రత్నశేఖర్‌రెడ్డి సాగు చేసి మిశ్రమ పంటలను తిరుపతి వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరం పొలంలో దాదాపు 70 రకాల పండ్ల చెట్లను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా అంతర్‌పంటగా వేరుశెన సాగు చేసినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తయారు చేసుకునే జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య మీనామృతం, పులిసిన పండ్ల ద్రావనం, పూల ద్రావణం, ఆకుల ద్రావణం తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అలాటీ టమాట, వేరుశెనగ, మిర్చి, వంగ, కర్బూజ పంటలను సందర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర వ్యయసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ హిమశ్రీ, డాక్టర్ ప్రదీప్, మాస్టర్ ట్రైనర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బోదేషావలి

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

పీలేరు : స్థానిక షీ దివ్య యోగా కేంద్రంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు మంళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాట నుంచి పాట ఉద్భవిస్తే మాటకు సంగీతం జత కలసి కళగా రూపాంతం చెందిందన్నారు. ముందు తరాల శ్రమైక జీవనం, కష్ట జీవులు రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరి వారి అలసట తీర్చి వారికి స్వాంతన చేకూర్చే కళారూపాలే జానపదాలు అన్నారు. అనంతరం జానపద ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో షీ దివ్య యోగ నిర్వాహకులు పి.వి.ఎస్. లక్ష్మీ, సుధాకర్, సామాజిక వెత్త జానం గంగిరెడ్డి, కళాకారుడు ఖాదర్‌బాషా, మాధవి, రమాదేవి, శోభారాణి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కేవీపల్లె : ప్రస్తుతం బెట్ట పరిస్థితులలో వేరుశనగ, వరి పంటలను కాపాడుకోవడానికి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం రాయచోటి ఏడీఏ ఎం.వి. శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కేవీపల్లెలో వేరువెనగ, వరి సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాధారంగా సాగు చేసిన వేరుశెనగ మొక్కలు నేలలో తేమలేకపోవడంతో వాడిపోవడం మొదలవుతోందన్నారు. 2 శాతం యూరియా ద్రావణాన్ని వేరుశనగ పైరుపై పిచికారి చేసుకోవడం ద్వారా 10 – 12 రోజుల పాటు పంటను కాపాడుకోవచ్చునని తెలిపారు. ఎకరాకు నాలుగు కిలోల యూరియాతో 200 లీటర్ల యూరియా ద్రావణంగా చేసుకుని పిచికారి చేయాలన్నారు. వరిలో ప్రస్తుతం ఉన్న వేడి వాతావరణంతో ఆకునల్లి, తెల్లనల్లి తెగులు ఆశించడం జరుగుతోందన్నారు. నివారణకు ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రావణి, రైతు శిక్షణ రైతు భరోసా కేంద్ర సిబ్బంది శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న ఏడీఏ ఎం.వి. శ్రీకాంత్

ఐటీఐలో మిగులు సీట్లకు అడ్మిషన్లు

తంబళ్లపల్లె : స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రైనింగ్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. ఈనెల 27లోపు అడ్మిషన్లు పొందవచ్చునట్లు తెలిపారు. ఫిట్టర్ ట్రేడ్‌లో 28, డ్రాఫ్ట్‌మెన్ సివిల్స్‌లో 22 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాస్, ఇంటర్మీడియట్ పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

సబ్సిడీపై ఉలవలు

ములకలచెరువు : ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి లీలా కుమారీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీకే కేంద్రాలకు ఇప్పటిదాకా 60 క్వింటాళ్ల ఉలవలు చేరినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పంపిణీ చేస్తామని తెలిపారు.

నేడు మండల సమావేశం

కేవీపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. మండల సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

దర్గా మాన్యం భూముల్లో ఆక్రమణల తొలగింపు

గుర్రంకొండ : గుర్రంకొండకు సమీపంలోని షంషేర్‌వలీ దర్గా మాన్యం భూముల్లో నెలకొన్న ఆక్రమణలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. సర్వే నం. 457/ఏలో 3.72 ఎకరాలు, 457/బి ఏలో6 ఎకరాలు, మొత్తం 9.72 ఎకరాలు భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం వక్ఫ్‌బోర్డుకు సంబ ంధించినది. వక్ఫ్‌బోర్డు గెజిట్ 1962 వ.నెం 3023 ప్రకారం సదరు భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినట్లుగా టైటిల్‌డీడ్ 3452గా నమోదైంది. సదరు భూమి షంషేర్‌వలీ దర్గా నిర్వహణ కోసం వక్ఫ్‌బోర్డు వారిచే రెడ్డిహుస్సేన్‌ఖాన్, లాల్‌ఖాన్‌లను ముతవల్లీలుగా నియమించారు. వారి అనంతరం వారి మనువడైన కాలేషా ప్రస్తుతం సంరక్షకుడిగా ఉన్నాడు. సర్వేనెంబరు 457/ఎ, బీలలో ఈద్గా మరియు కొన్ని సమాధులు ఉన్నాయి. అయితే మాన్యం భూముల్లో కొంత భాగం భూమిని కొందరు ఇటీవల ఆక్రమించుకొని ఇనుప కంచెలు వేసుకొన్నారు. ఈ విషయమే ఇటీవల పెద్ద ఎత్తున వివాదాలు, ఘర్షణలు జరిగాయి. ఈనేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌బాషా, ముస్లీమ్ మైనార్టీ సంక్షేమ అధికారి ఇమ్రాన్, తహసీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీబీలతో షంషేర్‌వలీ దర్గా వద్దకు చేరుకొన్నారు. మాన్యం భూములను ఆక్రమించుకొని ఇనుపకంచె వేసిన ప్రదేశంలో జేసీబీలతో వాటిని తొలగించారు. అక్కడే ఉన్న గుడారాలను నేల మట్టం చేశారు. సంఘటనా స్థలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో ముక్తియార్, సిబ్బంది పాల్గోన్నారు.



దర్గా మాన్యం భూముల్లో ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

అభివృద్ధితోనే జీవన ప్రమాణాలు పెంపు

తంబళ్లపల్లె : వైఎస్సాఆర్ క్రాంతి పథం మహిళా సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే కుటుంబాలలో జీవన ప్రమాణాలు పెరుగుతాయని డీపీఎం లక్ష్మిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్త్రీశక్తిభవన్‌లో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత, వ్యాపార, వృత్తిపరంగా అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు.

ఆర్టీసీలో షాపులకు టెండర్లు

మదనపల్లె సిటీ : మదనపల్లె –2 డిపో పరిధిలోని బస్‌స్టేషన్‌లోని 24 ఖాళీ స్థలాల్లో క్యాంటిన్, స్టాల్స్, షాపులు నిర్వహించుకునేందుకు ఆసక్తిగలవారు టెండర్లు దాఖలు చేసుకోవలని డీఎం –2 ఆర్‌సీ నిరంజన్ తెలిపారు.

మానవత్వంతో నిరుపేదలను ఆదుకోవాలి

వాల్మీకిపురం : మానవత్వంతో సమాజంలోని నిరుపేదలను ఆదుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించి, స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద మానవాహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటివారికి సహాయం చేసినప్పుడే ఆత్మ సంతృప్తినిస్తోందన్నారు. మానవత సంస్థ 2004 ఆగస్టు 22న ఏర్పడి ఈ రోజున 11 జిల్లాల్లో 80 మండలాల్లో 45వేల మంది సభ్యులతో విస్తరించి సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఫ్రీజర్ బాక్సులు, చైతన్యరథం, అంబులెన్స్‌లను ఉచితంగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, క్రిష్ణమూర్తి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, రామక్రిష్ణ రెడ్డి, అబ్దుల్‌కలీమ్, మహబూబ్‌బాషా, రాయుడు, షాహెద్, సాధిక్, చికెన్‌మస్తాన్, సైఫుల్లా, శంకర, మదనమోహన్ రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల

పేదలు తలెత్తుకు తిరిగేలా జగనన్న పాలన

పెద్దతిప్పసముద్రం : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదలు తలెత్తుకు తిరిగేలా సీఎం జగనన్న సుపరిపాలన అందిస్తున్నారని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ, బుచ్చిగారి సుబ్బిరెడ్డి అన్నారు. పల్లెబాటలో భాగంగా మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు బూర్లపల్లి పంచాయతీలో పర్యటించారు. ప్రజా సమస్యలు ఆలకిస్తూ, ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాల లబ్ధిని వివవించారు. అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై ఆరా తీస్తూ వాటి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ పల్లెబాట కొనసాగించారు. వచ్చే ఎన్నికల్లో కూడా తాము ఇలాంటి ప్రభుత్వ పాలకులకే సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ రమణ, మోహన్‌రెడ్డి, కోట్లోని వెంకటరెడ్డి, సోమశేఖర్, మంజునాథ్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, బొక్కసం శివ, కుంచే శీనూతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బూర్లపల్లి పంచాయతీలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలకు మహర్దశ

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలకు మహర్దశ పట్టిందని ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని బీరంగి గ్రామంలోని బీరంగి, శంకరాపురం, కువరపల్లె, కాచిపల్లెల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని అర్హుల వివరాలను సేకరించారు. ఇళ్లు, స్థలాలు కావాలని పలువురు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రూ.56 లక్షలతో పంచాయతీలో నిర్మించిన మురుగునీటి కాలువలు, సిమెంటురోడ్ల నిర్మాణం పూర్తవడంతో వాటిని ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ఖాదర్‌వలి, సర్పంచులు వెంకటరమణ, గిరిజ రఘునాథరెడ్డి, భీమిగాని నాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఉమామహేశ్వరీ, ఉజ్జయిని సాంబశివ, ఎంపీటీసీ యల్లప్ప, మాజీ వైస్‌ఎంపీపీ అరుణ్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాసీర్‌వలి, అధికారులు పాల్గొన్నారు.



బి.కొత్తకోట: కురవపల్లెలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మెగాజాబ్ మేళా కరపత్రాలు ఆవిష్కరణ

పీలేరు : ఈ నెల 26న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా కరపత్రాలు మంగళవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్‌మేళాకు 35 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. దాదాపు 3 వేల మందికి ఉద్యోగ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, మాజీ సర్పంచ్ హుమయూన్, షాజహాన్, అబిద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మదనపల్లె సిటీ : చిన్నతనం నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఏపీడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్యవరంలో సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంటులో భాగంగా రెండో రోజు వివిధ జట్లుకు పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అక్కులప్ప క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడకు శానిటోరియం ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచాలన్నారు. గెలుపు,ఓటములు సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

హోరా హోరీగా పోటీలు

రెండో రోజుల వివిధ జట్లు పోటీలకు తలపడ్డాయి. చెన్నై–చిత్తూరు జట్లు పోటీల్లో చెన్నై జట్టు 3–0 స్కోరుతో విజయం సాధించింది. వైజాగ్–మదనపల్లె జట్లు పోటీపడగా వైజాగ్ 13–0 స్కోరుతో గెలుపొందింది. తిరుపతి–ఎఎంసి–3 పోటీ పడగా తిరుపతి 2–0 స్కోరుతో విజయం సాధించింది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బండపల్లి అక్కులప్ప

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం/ బి.కొత్తకోట : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో భాగ్యమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండల కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో కార్యకర్త (ఓసీ), సాన్నువారిపల్లిలోని మినీ అంగన్‌వాడి కార్యకర్త (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే మండలంలో ఆయా పోస్టులైన పీటీఎం–2 (ఓసీ), బూర్లపల్లి–2 (బీసీ–బీ), పోతుపేట (ఓసీ), గుగ్గిళ్ళపల్లి (ఓసీ), బెట్టకొండ (ఓసీ), కొటాలవాండ్లపల్లి కేంద్రంలో (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు 21–35 ఏళ్ళ మధ్య వయస్సు ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా వివాహితులై ఉన్నవారు ఈ నెలాఖరులోగా దరఖాస్తు ఫారాలను బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ సూచించారు.

కేవీపల్లె : పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీలున్న అంగన్‌వాడీ పోస్టులు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో రాజమ్మ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఖాళీల వివరాలు వెల్లడించారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు పీలేరు మండలంలోని పెద్దగాండ్లపల్లె (ఓసీ), బండ్లవంక (బీసీ–ఈ), నాగిరెడ్డికాలనీ, మొటుకుపల్లె, యర్రదొడ్డిగారిపల్లె, రామానాయక్ తాండా (ఓసీ), కలకడ మండలంలో ఝురిగడ్డకొత్తపల్లె (ఓసీ) ఖాళీలున్నట్లు వివరించారు. అలాగే అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు కేవీపల్లె మండలంలో మార్రేళ్ల రెడ్డివారిపల్లె, వంగిమళ్లవారిపల్లె (ఓసీ) ఖాళీలున్నట్లు తెలిపారు.

గుర్రంకొండ : మండలం ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వాల్మీకిపురం సీడీపీవో భారతీ, గుర్రంకొండ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మీ తెలిపారు. మండలంలోని ఎల్లుట్ల అంగన్‌వాడీకేంద్రంలో సహాయకురాలి పోస్టు బీసీ–ఏ, అరిగెలవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సహయకురాలి పోస్టు బీసీ–డీ కేటగిరికి కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31 లోగా వాల్మీకిపురం సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.